ఆరోగ్య ప్రాప్తిరస్తు



- తల్లీబిడ్డల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ
- ఎంసీపీ కార్డుతో అనేక ప్రయోజనాలు
- చిన్నారులకు టీకాలు తప్పనిసరి



పెనికేరులో చిన్నారికి టీకా వేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది (ఫైల్)

అలమూరు: మాతృ, శిశు మరణాలు నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖలో సమూల మార్పులకు నాంది పలికింది. అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకంతో పాటు నిర్ణీత సమయంలో టీకాలు అందించడం, మందుల కొరత లేకుండా చర్యలు చేపట్టింది. మహిళలకు మెరుగైన ఆరోగ్యరక్షణే ధ్యేయంగా సులభంగా ప్రసవాలు జరిపేందుకు సత్వర చర్యలు తీసుకుంటోంది. గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, చిన్నారులకు సకాలంలో వేయించవలసిన టీకాలతో కూడిన విలువైన సమాచారంతో మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డులు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముద్రించింది. పీహెచ్‌సీ స్థాయిలో క్షేత్రస్థాయి సిబ్బందికి ఈ కార్డులను అందించడంతో ఆరోగ్య సిబ్బంది గర్భిణులకు అందజేస్తున్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టే వరకూ తీసుకోవలసిన జాగ్రత్తలు అందులో పొందుపరిచారు. సాధారణ వైద్య పరీక్షలు, రక్త పోటు, మూత్ర పరీక్షలు చేయించుకోవలసిన సమయాలను అందులో వివరించారు. అనారోగ్యానికి గురైతే చికిత్సను చేయిచుకోవలసిన విధానం సులభంగా తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది. కార్డులో ఇచ్చిన సమాచారాన్ని వినియోగించుకోవడం ద్వారా గర్భిణి సులభంగా తొమ్మిది నెలలు పూర్తయ్యి బిడ్డను ప్రసవించేనాటికి కనీసం 10 కేజీల బరువు పెరిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన, జననీ సురక్ష యోజన, ప్రధాని మాతృత్వ వందన యోజన, ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగే ప్రసవానికి ఆర్థిక సాయం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది.

శిశువులకు టీకాలే శ్రీరామరక్ష

అప్పుడే జన్మించిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల వరకూ సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో చిన్నారులకు ఇన్‌ఫెక్షన్ సోకి అనారోగ్యం బారినపడే అవకాశం ఉంది. దీంతో నిర్ణీత సమయానికి టీకాలు వేయించుకునేందుకు వీలుగా ఎంసీపీ కార్డుల్లో టీకాల కాల నిర్ణయ పట్టికను రూపొందించారు. నిర్దేశించిన సమయంలో టీకాలు వేయించుకునేందుకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఎంసీపీ కార్డును వెంట తీసుకువెళ్లాలి. ఒకవేళ పొరపాటున టీకా తేదీని మర్చిపోయినా వైద్యారోగ్య సిబ్బంది తమ రికార్డుల ఆధారంగా సమయానికి సమాచారం అందిస్తారు.

ఎంసీపీ కార్డు వినియోగం-తల్లీ బిడ్డకు ఉపయోగం

- ఆరోగ్య సిబ్బంది అందించే సేవల వివరాలతో పాటు వ్యాధి లక్షణాలను తెలియజేయడం ఎంసీపీ కార్డు ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది.
- గర్భాశయం ముఖద్వారానికి, రొమ్ముకు వచ్చే క్యాన్సర్ లక్షణాలను తెలియజేయడం
- సంచార చికిత్స అందించే చికిత్స విధానంపై అవగాహన కల్పించడం
- తొలికాన్పులో సాధారణంగా సంభవించే సమస్యల వివరాలు అందించడం
- బిడ్డకు తల్లిపాలు అందించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన
- గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన పౌష్టికాహారం వివరాలు



ఎంసీపీ కార్డు

- పిల్లల, శారీరక, మానసిక ఎదుగుదల గురించి తెలుసుకోవడం
- ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల ప్రాధాన్యం గుర్తించడం

ఎంసీపీ కార్డులపై అవగాహన పెంచుతున్నాం



రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య రక్షణ కోసం ప్రవేశపెట్టిన ఎంసీపీ కార్డులను సద్వినియోగం చేసుకోవడంపై ఆరోగ్య సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఎంసీపీ కార్డు ద్వారా గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకూ తీసుకోవలసిన జాగ్రత్తలు, శిశువుకు సకాలంలో అందించవలసిన టీకాలపై అవగాహన ఏర్పడుతుంది.

– ఎం.సుమలత, జిల్లా అదనపు జిల్లా వైద్యాధికారి, కొత్తపేట

క్లుప్తంగా

రామలింగేశ్వరునికి లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్త దంపతులు

మామిడికుదురు: స్థానిక శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు చంద్రమౌళి శంకరం ఆధ్వర్యంలో ఈదరాడకు చెందిన బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, రామలింగేశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. రామలింగేశ్వరునికి లక్ష మారేడు దళాలతో అర్చన చేశారు. నీరాజన మంత్ర పుష్పం, సూర్య నమస్కారాలు, చండీహోమం, రుద్రహోమం జరిపించారు. పలువురు భక్త దంపతులు లక్ష బిల్వార్చనలో కర్తలుగా పాల్గొన్నారు.

శాకంబరిగా సోమాలమ్మ



ఆలమూరు: మండలంలోని జొన్నాడలో వేంచేసియున్న గ్రామ దేవత సోమాలమ్మ అమ్మవారు శాకంబరి రూపంలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. స్థానిక అంజనేయస్వామి ఆలయ ఆవరణలో కార్తిక సమారాధన జరిగింది.

వైభవంగా కుంకుమ పూజలు

ఆలమూరు: హిందూ ధర్మ ప్రచార మాసోత్సవాల్లో భాగంగా రాష్ట్ర దేవదాయశాఖ ఆదేశాల మేరకు మండలంలోని పెదపళ్లలో శనివారం కుంకుమ పూజలను భక్తులు నిర్వహించారు. చింతలూరులోని శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ పర్యవేక్షణలో నాలుగో విడత స్థానిక పోలేరమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో వేద పండితులు పి.నరసింహమూర్తి మంత్రోచ్చారణల మధ్య ఈ పూజలను నిర్వహించారు. మహిళా భక్తులు శ్రీలలితా సహస్ర నామ పారాయణ చేశారు. ఈఓ ఉండవిల్లి వీర్రాజు, జూనియర్ అసిస్టెంట్ డి.భాస్కర్ శ్రీనివాస్, సర్పంచ్ యేడిద సత్యశ్రీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ



తైక్వాండో పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

అంబాజీపేట: ఈ నెల 18, 19 తేదీలలో తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచారని తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. అంబాజీపేటలో తైక్వాండో క్రీడాకారులను మంగళవారం పలువురు అభినందించారు. 41వ సబ్ జూనియర్, 6వ కెడిట్ ఇంటర్ డిస్ట్రిక్ పోటీలు నిర్వహించారన్నారు. సబ్ జూనియర్ విభాగంలో కె.లాస్య అద్విక, జి.లహిరి తేజ, కెడిట్ విభాగంలో జి.పూజితా దేవి, ఆర్.హెచ్.వి.మూర్తి తృతీయ స్థానాల్లో నిలిచారని త్రిమూర్తులు తెలిపారు. తైక్వాండో విద్యార్థులను హెచ్ఎం కె.సాయిరామ్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందించారు.

వంట పాత్రల పంపిణీ

అయినవిల్లి: గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందజేసిన వంట పాత్రలను నేదునూరు, ఎస్.మూలపాలెం, శానపల్లిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జీవిత గమనం మార్చేవి పుస్తకాలే

మలికిపురం: జీవిత గమనం మార్చేవి పుస్తకాలేనని మలికిపురం ఏఎఫ్‌డీటీ ప్రభుత్వ ఎయిడెడ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మంగెన వేంకట సత్యనారాయణమూర్తి అన్నారు. కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ తోరం సతీష్, గ్రంథాలయ విభాగాధిపతి వై.మల్లికార్జునరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం జరిగింది.

వివాహిత అదృశ్యంపై కేసు

అంబాజీపేట: ఓ వివాహిత అదృశ్యంపై ఆమె బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ మంగళవారం తెలిపారు. చిరతపూడికి చెందిన ఓ వివాహిత ఈ నెల 21 తెల్లవారుజాము నుంచి కనిపించకపోవడంతో ఆమె బంధువులు వెతికినప్పటికీ కనిపించలేదన్నారు. వివాహిత అదృశ్యంపై మామగారు ఆర్.వీరభద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాళ్వాకు పూర్తి స్థాయిలో నీరు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి

మామిడికుదురు: దాళ్వా పంట సాగు చేసే రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించే దిశగా అధికారులు కార్యాచరణ చేపట్టారని అమలాపురం ఆర్డీఓ జి.కేశవవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరం ఆర్‌బీకేలో మంగళవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయిలో ఇరిగేషన్ అధికారులతో ఇటీవల జరిగిన సమావేశంలో సాగునీటి సరఫరాపై భరోసా ఇచ్చారని చెప్పారు. డిసెంబర్ నెలాఖరుకు నాట్లు పూర్తి చేసుకోవాలని ఇరిగేషన్ ఏఈ డి.సుందర్‌సింగ్ సూచించారు. మార్చి నెలాఖరు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రతి నీటి బొట్టు విలువైందన్న విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. వంతుల వారీ విధానం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాలువ శివారు ప్రాంతాల రైతులు ఆందోళన వ్యక్తం చేవారు. శివారు ప్రాంతాలకు సాగునీటి సమస్య తీవ్రంగా ఉంటుందని అన్నారు. వంతుల వారీ విధానానికి స్వస్తి పలకాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, ఏఓ బి.మృదుల, ఎంఎస్ఓ దేవళ్ల శ్రీనివాస్, ఆర్ఐ అలీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

మామిడికుదురు: పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తామని అమలాపురం ఆర్డీఓ జి.కేశవవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుపై మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో ఆర్డీఓ చర్చించారు. అనంతరం నగరం, మామిడికుదురు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అక్కడ రైతులతో మాట్లాడారు. గతేడాది ధాన్యం కొనుగోలులో రైతులు పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పలు మార్పులు చేశామని ఆర్డీఓ పేర్కొన్నారు. తేమ శాతం నమోదులో ఎటువంటి సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తాము పండించిన పంటను స్థానికంగానే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. దూర ప్రాంతాలకు తీసుకువెళ్లాలని గత ఏడాది ఇబ్బంది పెట్టారని, దాని వల్ల చాలా సమస్యలు ఎదుర్కొన్నామన్నారు. వీటిపై ఇటీవల జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో చర్చించామన్నారు. 'మీకు ఏ సమస్య ఉన్నా వెంటనే నాకు ఫోన్ చేయండి, దాన్ని పరిష్కరిస్తానంటూ' రైతులకు ఆర్డీఓ భరోసా ఇచ్చారు.

అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల పరిశీలన



నవా అవుట్ ఫాల్ స్లూయిజ్ తలుపులను పరిశీలిస్తున్న ఈఈ కాశీవిశ్వేశ్వరరావు తదితరులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఏటిగట్టుకున్న గొంది, నవా, రాళ్ల మురుగు కాలువల అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను మంగళవారం హెచ్‌వర్క్స్ అధికారులు, రాజకీయ నేతలు పరిశీలించారు. రాళ్ల మురుగు కాలువ అవుట్‌ఫాల్ స్లూయిజ్ కొత్త నిర్మాణం నేపథ్యంలో పరిష్కరించాల్సిన సమస్యలను జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశంలో కలెక్టర్ దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. నవా, గొంది మురుగుకాలువల అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకున్న తేలికపాటి తలుపులు తెరుచుకోవడంలో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని, మురుగు గోదావరిలోకి దిగేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందించి అధికారులతో పాటు, రాజకీయ నేతలను వీటి పరిశీలనకు పంపారు. ఈ మేరకు హెచ్‌వర్క్స్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, రాష్ట్ర అగ్రిమిషన్ మెంబర్ జి.బాబి, జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి మెంబర్ గుబ్బల రమేష్ పరిశీలించారు. రాళ్ళ కాలువ అవుట్‌ఫాల్ స్లూయిజ్ కొత్త నిర్మాణానికి ప్రతిపాదనలు వెళ్లాయని, నిధులు మంజూరు కావాల్సి ఉందని హెచ్‌వర్క్స్ ఏఈ టీవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. సర్పంచ్‌లు దెందుకూరి శ్రీహరి రాజు, పోతురాజు నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు చొప్పల బాబూరావు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ నల్లి శివకుమార్, రైతు జంపన ప్రసాదరావు పాల్గొన్నారు.

ధాన్యం సంరక్షణకు ఏర్పాట్లు



చింతలూరులో ధాన్యంపై కప్పిన బరకాలు

ఆలమూరు: బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా రైతులు తేమ శాతం తగ్గని ధాన్యాన్ని రాశులుగా పోసి సంరక్షణ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆకాశం రెండు రోజుల పాటు మేఘావృతం కావడంతో పాటు అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో అధికారులు ఆ మేరకు నష్ట నివారణ చర్యలు చేపట్టి రైతులను అప్రమత్తం చేశారు. మండలంలో సుమారు 9,500 ఎకరాలు సాగు చేయగా ఇప్పటి వరకూ సుమారు ఆరు వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా స్వీకరించిన దాదాపు రెండు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైసుమిల్లులకు సరఫరా చేయగా కల్లాల మీద ఇంకా 900 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీ లావణ్య మంగళవారం తెలిపారు.

రైతుకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

ఆత్రేయపురం: రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ అన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని లొల్ల గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. లొల్ల గ్రామంలో సత్తిరామకృష్ణారెడ్డి రైస్ మిల్లును పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

రబీ సాగుకు సమాయత్తం కావాలి

రాజోలు: రబీ సాగుకు రైతులు సమాయత్తం కావాలని డీఆర్‌సీ ఏడీఏ రాజశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం సోంపల్లిలోని రైతు భరోసా భవనంలో రాజోలు సబ్ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. డీఆర్‌సీ ఏడీఏ రాజశేఖర్, రాజోలు సబ్ డివిజన్ ఏడీఏ రామ్మోహనరావు మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీ లోపు వరినాట్లు పూర్తి చేసే విధంగా రైతులను క్షేత్రస్థాయి సిబ్బంది ప్రేరేపించాలన్నారు. విత్తనాలు ఎంపిక, విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలపై వివరించారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల వ్యవసాయాధికారులు వై.మధుకుమార్, రాకేష్, నరసింహారావు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

రైతులకు చిరు జల్లుల కలవరం



మామిడికుదురులో చిరు జల్లులకు తడిసిన పనలపై ఉన్న వరి పంట

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో పడుతున్న చిరు జల్లులు రైతులను కలవర పెడుతున్నాయి. ఎంతో కష్టపడి సాగు చేసిన పంట చేతికందే సమయంలో ప్రతికూల వాతావరణంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి దట్టమైన మేఘాలతో కూడిన వాతావరణంతో రైతులు గాబరా పడుతున్నారు. అడపాదడపాగా పడుతున్న చిరు జల్లులు రైతులను కలవర పెడుతున్నాయి. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు సైతం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మామిడికుదురు మండలంలో 2,410 ఎకరాల విస్తీర్ణంలో సార్వా సాగు చేశారు. ఈ పంట ప్రస్తుతం ఇప్పుడిప్పుడే కోత దశకు చేరింది. మామిడికుదురు, నగరం, గెద్దాడ, పాశర్లపూడి గ్రామాల్లో పంట కోత దశకు చేరింది. మండల పరిధిలో అయిదు శాతం కోతలు పూర్తి అయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో కొంత పంట పనలపై ఉంది. ఈ పరిస్థితుల్లో వర్షం కురిస్తే వెన్ను బరువెక్కి పంట మొత్తం నేలనంటే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గండం నుంచి గట్టెక్కించాలని వరుణ దేవుడిని ప్రార్థిస్తున్నారు.

సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించాలి

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



గోపాలపురంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం: గడచిన నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ఇంటింటికి వివరించాలని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రజలకు పిలునిచ్చారు. మండలంలోని గోపాలపురం సచివాలయం-2 పరిధిలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల బూత్ కన్వీనర్, జేసీఎఫ్ కన్వీనర్ కర్రి గోవింద కృష్ణారెడ్డి ఈ కార్యక్రమానికి పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. సర్పంచ్ సబ్బితి మోహనరావు ఆధ్వర్యంలో తొలుత సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును నాయకులు ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో నేతలు సచివాలయం-2 పరిధిలో జరిగిన సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి కార్యక్రమాలను గణాంకాలతో వివరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ శ్రేణులకు టోపీలను, జెండాలను అందజేశారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబునాయుడు పాలనలో జరిగిన సంక్షేమం అభివృద్ధి, వైఎస్ జగన్ పాలనలో జరిగిన సంక్షేమం అభివృద్ధి పనులపై తేడాలను తెలుసుకుంటూ ప్రజాభిప్రాయ సేకరణను చేశారు. అక్కడ నుంచి ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని నాయకులు పల్లెనిద్ర చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, దేవరపల్లి సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, మాజీ ఉప సర్పంచ్ చిర్ల రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మైగాపుల గంగాభవాని, పల్లి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమానికి కేరాఫ్‌గా ఆంధ్రా

అంబాజీపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న పథకాలతో మన రాష్ట్రం సంక్షేమానికి కేరాఫ్‌గా నిలిచిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలనపై ఇతర రాష్ట్రాల వారు అధ్యయనం చేస్తున్నారన్నారు. వచ్చే జనవరి నుంచి పింఛన్ రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెరుగుతుందన్నారు. సంక్షేమ పథకాల డిసిప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాయుడు షన్ముఖ్ ఇంటి వద్ద సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సంక్షేమ రాజ్యం సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్ పేర్కొన్నారు. మామిడికుదురు సచివాలయం వద్ద మంగళవారం రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం సర్పంచ్ గోస్ మొహిద్దీన్ అధ్యక్షతన జరిగింది. సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తున్న జగన్‌కు అండగా నిలవాలని ఆదిత్యకుమార్ పేర్కొన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, ఎంపీటీసీ సభ్యుడు వర్ధినేని రాము, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, కంచి శ్రీరామ్, నయినాల రామకృష్ణ పాల్గొన్నారు.

ముంగండలో..

పి.గన్నవరం: మండలంలోని ముంగండలో జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు ఆధ్వర్యంలో 'ఏపీకి సీఎం జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కుసుమ చంద్రకళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. రాజుల పాలెం సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు, నాయకులు కుసుమ వెంకటేశ్వరరావు, మహ్మద్ వలీ పాల్గొన్నారు.

బడుగువానిలంకలో..

ఆలమూరు: రాష్ట్రంలోని పేద బడుగు, బలహీన వర్గాల ప్రతినిధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా వ్యవహరిస్తూ వారి అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని బడుగువానిలంకలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. గ్రామ సచివాలయ కార్యాలయంలో పల్లె నిద్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరారాజు పాల్గొన్నారు.



జి.అగ్రహారంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

జగన్ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంతోషం

ఆత్రేయపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంతోషంగా ఉన్నారని పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు పేర్కొన్నారు. జగనే ఎందుకు కావాలంటే అంకంపాలెంలో నిర్వహించారు. మాజీ సర్పంచ్ గారపాటి అబ్బులచౌదరి, గంగారామ్ చౌదరి, జిల్లా వైఎస్సార్ సీపీ కార్యవర్గ సభ్యులు కొల్లి శ్యామ్‌సన్ పర్యటించారు. అంకంపాలెంలో రూ.23 కోట్లు సంక్షేమ పథకాలకు అందించారన్నారు. రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు.

నృత్యానికి స్వర్ణ నంది పురస్కారం



పిఠాపురంలో గాయత్రికి స్వర్ణ నంది అందజేస్తున్న నృత్యాంజలి నిర్వాహకులు

కొత్తపేట: స్థానిక విద్యార్థిని కె.శ్రావణ హర్షిత గాయత్రి సంప్రదాయ నృత్య ప్రదర్శనతో స్వర్ణ నంది అందుకుంది. పిఠాపురంలో కాకినాడ నృత్యాంజలి అకాడమీ శ్రీహరిహర నాదేశ్వర సేవా ట్రస్ట్ సౌజన్యంతో ఆదివారం 'నృత్యాంజలి - నృత్యోత్సవం' కార్యక్రమ నిర్వహించారు. ఈ నృత్యోత్సవంలో ప్రశంసా పత్రంతో స్వర్ణ నంది పురస్కారాన్ని ప్రదానం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

అంబాజీపేట: విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లోనే లభించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాస్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న గోరుముద్ద వంట సామగ్రిని మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, వాసంశెట్టి చినబాబు, రాయుడు షన్ముఖ్, పులిదిండి ఏడుకొండలు పాల్గొన్నారు.

సాయం అందజేత

రాజోలు జోన్: మలికిపురం మండలం కత్తిమండ కాలనీలో గుర్రం శాంతకుమారి పక్షవాతంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకొన్న వైఎస్సార్ కాంగ్రెస్ కతర్ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ రూ.5,000 సహాయం మంగళవారం అందించారు.

ప్రపంచ మత్స్యకార దినోత్సవం

పి.గన్నవరం: ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని మంగళవారం పి.గన్నవరంలో నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శేరు శ్రీనుబాబు, పెమ్మాడి మారుతీ కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అక్విడెక్టు పార్కులోని అంతర్వేది ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ, అగ్నికుల క్షత్రియ సంఘ రాష్ట్ర నాయకుడు పెమ్మాడి సుబ్బరాజుల విగ్రహాలకు నాయకులు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. మండల సంఘ అధ్యక్షుడు కొల్లు రాంబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎంపీటీసీ సభ్యుడు అవనిగడ్డ సత్తిబాబు, మాజీ సర్పంచ్ కొపనాతి సీతారామస్వామి, నాయకులు కొల్లాటి వెంకట్రావు, లంకే చిరంజీవి, కొల్లు గంగాద్రి, కామాడి రామకృష్ణ పాల్గొన్నారు.

క్షతగాత్రునికి ఆర్థిక సాయం

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన రాపాక ప్రసాద్, నాగమణిల కుమారుడు ప్రశాంత్‌రెడ్డి ప్రమాదవశాత్తు తలకు బలమైన గాయమై మతిస్థిమితం కోల్పోయి హాస్పిటల్లో వైద్యం చేయించుకుంటున్నాడు. గ్రామస్తులు సమకూర్చిన రూ.9,200ను, నాగమణికి మంగళవారం అందించారు. సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మట్ట అనంతలక్ష్మి, నాయకులు తుపాటి శ్రీనివాసరావు, ఉల్లంపర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యం గుర్తించాలి

కొత్తపేట: సమాజంలో ప్రతీ ఒక్కరూ ఓటు ప్రాధాన్యాన్ని గుర్తించాలని ఆర్డీఓ ఎం.ముక్కంటి సూచించారు. మంగళవారం స్థానిక శతాబ్ది డిగ్రీ కళాశాలలో తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ కట్టా నాగమోహన్ అధ్యక్షతన ఓటు హక్కుపై అవగాహన, ఓటు నమోదు నిర్వహించారు. ఆర్డీఓ ముక్కంటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నిజాయితీ కలిగిన ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవడానికి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, ఎన్నికల ఎస్ఏ అర్జమ్మ, వీఆర్‌ఓలు ఏసుబాబు, వీరేంద్ర పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వ సభ్య సమావేశం జరగనుందని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

హస్తకళలపై వర్క్‌షాప్

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సెమినార్ హాల్‌లో మంగళవారం విజయవాడకు చెందిన హస్తకళ సేవా కేంద్రం డ్వాక్రా మహిళలకు హస్తకళలపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించింది. ఎంపీపీ వీరా మల్లిబాబు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ హస్తకళల పట్ల డ్వాక్రా మహిళలను ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంపీడీవో జి.భీమారావు, వెలుగు ఏపీఎం విజయ్ పాల్గొన్నారు.

కొమ్ము పురుగు నివారణకు చర్యలు

అంబాజీపేట: కొబ్బరి చెట్లను పట్టిపీడిస్తున్న కొమ్ము పురుగును అరికట్టేందుకు నివారణ చర్యలు చేపట్టాలని రావేప్ విద్యార్థులు కె.శిరీష, డి.శ్రీలక్ష్మి, కె.శృతి, కె.శ్వేత, కే.భావన రైతులకు వివరించారు. గంగలకుర్రు అగ్రహారంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన కొమ్ము పురుగు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.